చెట్లు నరికితే శిక్షనే..

- జిల్లాలో 6 నెలల్లో 37 మందికి జరిమానా
- నిర్లక్ష్య అధికారులపై వేటు
- జీపీలదే సంరక్షణ బాధ్యత
- ఎల్లారెడ్డిపేటలో వరుసగా జరిమానాలు

హరితహారం మొక్కలను అనుమతులు లేకుండా నరికివేసిన ఎల్లారెడ్డిపేటకు చెందిన ఓ వ్యక్తికి పంచాయతీ అధికారులు జరిమానా విధించారు. మొక్కలు ఏపుగా పెరిగి చెట్లుగా మారడంతో రోడ్ల వెంట భవనాలు నిర్మించుకుంటున్న వ్యక్తులు అక్రమంగా వాటిని తొలగిస్తున్నారు. ఇలా తొలగించిన వారిని గుర్తించిన అధికారులు జరిమానాలు విధించడమే కాకుండా క్రిమినల్ కేసులు నమోదు చేస్తున్నారు.


రాత్రివేళ చెట్లను నరికివేస్తున్న వ్యక్తులు

ఎల్లారెడ్డిపేట: రాష్ట్ర ప్రభుత్వ హరితహార కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టి మొక్కలను నాటారు. నాటిన ప్రతీ మొక్కను బతికించుకోవడానికి అహర్నిశలు అధికారులు, పంచాయతీ సిబ్బంది శ్రమిస్తున్నారు. నాటిన మొక్కలు ఏపుగా పెరిగి పల్లెలకు పచ్చదనంతో స్వాగతం పలుకుతుండగా, కొంతమంది వాటిని తమ స్వార్థప్రయోజనాల కోసం మొక్కలు, వృక్షాలపై గొడ్డలివేటు వేస్తున్నారు. దీన్ని అధికార యంత్రాంగం సీరియస్‌గా పరిగణించి జరిమానాలు విధించడమే కాకుండా క్రిమినల్ కేసులు నమోదు చేస్తున్నారు. రాజన్నసిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా మొక్కలు నరికివేసిన 37 మందికి పంచాయతీ అధికారులు జరిమానాలు విధించారు. ఒక్క ఎల్లారెడ్డిపేటలోనే ఆరుగురికి అధికారులు జరిమానాలు విధించారు. విధుల్లో నిర్లక్ష్యంగా ఉన్న అధికారులపై సస్పెన్షన్ వేశారు. మొత్తంగా మొక్కల సంరక్షణే ప్రధాన లక్ష్యంగా అధికారులు ముందుకెళ్తున్నారు.

మొక్కల సంరక్షణపైనే దృష్టి

మండలంలో హరితహారంలో భాగంగా ప్రధాన రహదారులు, పొలంగట్లు, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల ఆవరణలలో నాటిన మొక్కలు నేడు వృక్షాలుగా మారాయి. అవి ఈ స్థాయికి రావడానికి ఉపాధిహామీ సిబ్బందితోపాటు గ్రామ పంచాయతీ అధికారులు అహర్నిశలు కష్టపడ్డారు. మొక్కల సంరక్షణపై నిత్యం జిల్లా స్థాయి అధికారులు పర్యవేక్షించడంతోనే గ్రామాల్లో నేడు పచ్చదనం ఫరిడవిల్లుతోంది. ఈ నేపథ్యంలో కంటికి రెప్పలా కాపాడిన మొక్కలను వారి అవసరాల కోసం నరికివేస్తున్న వ్యక్తులపై అధికారులు సీరియస్‌గా చర్యలు తీసుకుంటున్నారు. ముస్తాబాద్‌లో మొక్కలను తిన్న మేకలను గ్రామపంచాయతీలో బంధించి యజమాని రూ.2 వేలు జరిమానా తీసుకోవడం మొక్కల సంరక్షణపై అధికారుల తీరును స్పష్టం చేస్తోంది.

6 నెలల్లో 37 మందికి జరిమానాలు

జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో రహదారుల వెంట ఏర్పాటు చేసిన ఎవెన్యూ ప్లాంట్ల మొక్కలే నరికివేతకు గురవుతున్నాయి. భవన నిర్మాణాలకు అడ్డుగా వస్తున్నాయనే ప్రధాన కారణంతో రాత్రికి రాత్రే చెట్లను తొలగిస్తున్నారు. దీన్ని గుర్తించిన అధికారులు ఆరు నెలల వ్యవధిలో జిల్లా వ్యాప్తంగా 37 సంఘటనల్లో జరిమానాలు విధించారు. అంతేకాకుండా మొక్కల సంరక్షణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులను సస్పెండ్ చేస్తున్నారు. ఉదాహరణకు ఇటీవల ఎల్లారెడ్డిపేటలో రోడ్ల వెంట నాటిన మొక్కలకు నీరు పట్టకపోవడంతో అవి ఎండిపోయినట్లు గుర్తించిన కలెక్టర్, పంచాయతీ ఈవో ప్రవీణ్‌కుమార్‌ను సస్పెండ్ చేశారు. మొక్కల సంరక్షణే బాధ్యతగా నిర్లక్ష్యంగా చేసే అధికారులపై వేటు వేయడంతోపాటు నరికివేస్తున్న వారికి జరిమానాలు విధించడమే కాకుండా క్రిమినల్ కేసులు నమోదు చేస్తున్నారు. మండలంలో వరుసగా చెట్లను నరికివేస్తున్న వారికి జరిమానాలు విధిస్తున్నారు. దీంతో చెట్ల జోలికి వెళ్లేందుకు జంకుతున్నారు.


ఇంటి ముందున్న చెట్టును నరికివేస్తున్న యజమాని

క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం



హరితహారంలో నాటిన మొక్కలు, వృక్షాలను అనుమతులు లేకుండా తొలగిస్తున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం. అత్యవసరమైతే తొలగించడానికి ఇంటి యజమానులు సంబంధిత జీపీలలో దరఖాస్తులు చేసుకోవాలి. అలాకాకుండా చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని మొక్కలను నరికివేస్తే ఉపేక్షించేది లేదు.పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలను సంరక్షించే బాధ్యత అందరు తీసుకోవాలి.

– చిరంజీవి, ఎంపీడీవో, ఎల్లారెడ్డిపేట

పల్లెల్లో పంపకాల పంచాయితీ

- ప్రజాప్రతినిధులను నిలదీస్తున్న సభ్యులు


చందుర్తి మండలం లింగంపేటలో ఆందోళన చేస్తున్న మహిళా సంఘం సభ్యులు (ఫైల్)

వేములవాడరూరల్/చందుర్తి: అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీల నాయకులు ఇచ్చిన డబ్బులను తమకు అందజేయలేదని కొంతమంది మహిళా సంఘాల సభ్యులు ఆయా పార్టీల నాయకులను గ్రామాల్లో నిలదీస్తున్నారు. రెండు రోజుల క్రితం చందుర్తి మండలం లింగంపేటలో ఓ పార్టీకి చెందిన నాయకుడు తమకు రావాల్సిన డబ్బులను ఇవ్వలేదని అతని ఇంటి ముందు ఆందోళన చేసిన విషయం తెలిసిందే. వేములవాడరూరల్ మండలంలోని లింగంపల్లిలో అదే విధంగా మహిళా సంఘాలకు వచ్చిన డబ్బులను ఓ నాయకుడు ఇవ్వకుండా వాడుకోవడంతో ఆయనను నిలదీసినట్లు సమాచారం. ఈ విధంగా వేములవాడ నియోజకవర్గంలో చాలా గ్రామాల్లో పార్టీల నుంచి వచ్చిన డబ్బును కొంత మంది నాయకులు ఇవ్వకపోవడంతో విషయం తెలుసుకున్న మహిళలు, కులసంఘాల సభ్యులు సదరు వ్యక్తులను నిలదీస్తున్నారు. చాలా గ్రామాల్లో ఇదే పరిస్థితి నెలకొంది.

అందరి సహకారంతో గెలుస్తా


రైతులతో మాట్లాడుతున్న కేకే మహేందర్

వీర్నపల్లి: అందరి సహకారంతో తాను ఈ ఎన్నికల్లో గెలుస్తానని సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి కేకే మహేందర్‌రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. శుక్రవారం మండలంలోని గర్జనపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని సీతారామ్‌నాయక్ తండాలో ఆర్‌ఎంపీ మహిపాల్ తండ్రి భూక్య పంతులునాయక్(75) మృతిచెందగా ఆ కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. అనంతరం మండల కేంద్రంలోని రైతులు, యువకులు, మహిళలతో కాసేపు ముచ్చటించారు. తనకు ఓటు వేసిన ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు భూత శ్రీనివాస్, మల్లారపు అరుణ్‌కుమార్, కాంతయ్య, సంజీవ్, కుమార్, మహేందర్ పాల్గొన్నారు.

మీ కష్టం వెలకట్టలేనిది

- వేములవాడ కాంగ్రెస్ అభ్యర్థి ఆది శ్రీనివాస్


నాయకులు, కార్యకర్తలతో ఆది శ్రీనివాస్

వేములవాడ: వేములవాడ ఎమ్మెల్యేగా తనను గెలిపించేందుకు మీరు పడిన కష్టం వెలకట్టలేనిదని ఆది శ్రీనివాస్ నాయకులు, కార్యకర్తలతో అన్నారు. శుక్రవారం తనను కలిసేందుకు వచ్చిన వారితో ముచ్చటించారు. ఈ సందర్భంగా తన గెలుపు కోసం కృషి చేసిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. 3న ఎన్నికల ఫలితాల అనంతరం ప్రచారానికి ఎలా వచ్చానో అలాగే మళ్లీ గ్రామగ్రామానికి వచ్చి అందరినీ కలుస్తానన్నారు. ఏదైనా సమయంలో పని ఒత్తిడి కారణంగా మనసునొప్పించి ఉంటే మంచి మనసుతో అర్థం చేసుకోవాలని ఆయన కోరారు.

పరామర్శ

కోనరావుపేట: మండలంలోని పలు గ్రామాల్లో బాధిత కుటుంబాలను ఆది శ్రీనివాస్ పరామర్శించారు. నిజామాబాద్‌లో మృతి చెందిన ఈర్ల బాబు, నిమ్మపల్లిలో మృతి చెందిన రేపాక రాజిరెడ్డి, మరిమడ్లలో ఆకుల చిన్న నారాయణ తండ్రి రాజయ్య మృతి చెందగా వారి కుటుంబాలను పరామర్శించారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు షేక్ ఫిరోజ్ పాషా, కిసాన్‌సెల్ అధ్యక్షుడు కేతిరెడ్డి జగన్మోహన్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

వేములవాడరూరల్: మండలంలోని ఎదురుగట్ల గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న కర్ర కిషన్‌రెడ్డిని పరామర్శించారు. సర్పంచ్ కరుణాకర్, మాజీ ఎంపీపీ రంగు వెంకటేశంగౌడ్, జీవన్‌రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు శంకర్ పాల్గొన్నారు.

భారీ మెజార్టీతో గెలుస్తా

- వేములవాడ బీఆర్‌ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావు



వేములవాడ: ఈ ఎన్నికలో భారీ మెజార్టీతో గెలుస్తామని బీఆర్‌ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావు ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం మాట్లాడుతూ ఎన్నికల కోసం రెండు నెలలుగా చేస్తున్న కృషి, పోల్ మేనేజ్‌మెంట్‌లో మీ శ్రమ ఎంతో గొప్పదని, ఈ బంధం ఇలాగే కొనసాగిస్తానని అన్నారు. నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

బీఆర్‌ఎస్‌కే ప్రజాదరణ


మాట్లాడుతున్న రవీందర్‌రావు

గంభీరావుపేట: అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కే ప్రజలు పట్టం కట్టనున్నారని ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజాదరణ ఉందని టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. బీఆర్‌ఎస్ అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు. ఈ సమావేశంలో మండల అధ్యక్షుడు వెంకటస్వామి, పట్టణ అధ్యక్షుడు వెంకటి, సెస్ డైరెక్టర్ నారాయణరావు, దయాకర్‌రావు, రాజేందర్, లక్ష్మణ్, సురేందర్‌రెడ్డి, కమలాకర్‌రెడ్డి, రాజు పాల్గొన్నారు.

ఎయిడ్స్ నివారణకు కృషి చేద్దాం



ముస్తాబాద్: పోతుగల్‌లో ఎయిడ్స్ అవగాహన ర్యాలీ

వేములవాడఅర్బన్: కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్.బి. రాజగోపాల్ ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా వేములవాడ మండలం అగ్రహారం శ్రీరాజరాజేశ్వరస్వామి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఈ వ్యాధికి నిరంతర చికిత్స అవసరమని అన్నారు. నివారణ ఒక్కటే మార్గమని తెలిపారు. దేశవ్యాప్తంగా సుమారుగా 25 లక్షల మంది ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులున్నారన్నారు. ఎయిడ్స్ బారిన పడకుండా ఉండటానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం విద్యార్థులు ఎయిడ్స్ నివారణ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పోగ్రామ్ అధికారి కనుకయ్య, రవికుమార్, ప్రభాకరాచారి, కృష్ణ, మనోహార్, సంధ్యరాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: మండలంలోని పోతుగల్‌లో వైద్యాధికారి గీతాంజలి ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ ఒకప్పుడు ప్రపంచాన్ని గడగడలాడించిన ఎయిడ్స్ వ్యాధి నేడు తక్కువ స్థాయిలో నమోదు అవుతున్నప్పటికీ, ప్రతి ఒక్కరు ఎయిడ్స్ సంక్రమించకుండా చూసుకోవాలన్నారు. రక్త మార్పిడి, ఇంజెక్షన్ల సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎమ్‌లు, ఆశ వర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.


ఓబులాపూర్‌లో అవగాహన ర్యాలీ


వేములవాడ అర్బన్: మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రాజగోపాల్

ఎల్లారెడ్డిపేట: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రతి ఒక్కరు ఎయిడ్స్‌పై అవగాహన పెంచుకోవాలన్నారు. జాగ్రత్తలు పాటించడం ద్వారానే ఎయిడ్స్ ఒకరి నుంచి మరొకరికి వ్యాపించదన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి పర్శరాములు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: మండలంలోని ఓబులాపూర్ గ్రామంలో నేరెళ్ల పీహెచ్‌సీ మెడికల్ అధికారి డాక్టర్ జిందం రేఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నందగిరి నర్సయ్య, ఉప సర్పంచ్ మధు, పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్, వైద్య సిబ్బంది సౌజన్య, స్రవంతి, నవీన, గ్రామస్తులు పాల్గొన్నారు.



ఎల్లారెడ్డిపేట: మాట్లాడుతున్న ప్రిన్సిపాల్

బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి కాలం చెల్లింది


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

తంగళ్లపల్లి/ఎల్లారెడ్డిపేట/ముస్తాబాద్: రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి కాలం చెల్లిందని, కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతుందని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, మండల అధ్యక్షులు లక్ష్మారెడ్డి, జాలగం ప్రవీణ్(టోని), యెల్ల బాల్‌రెడ్డి, డీసీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దిగారి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ఆయా మండల కేంద్రాల్లో వారు వేర్వేరుగా మాట్లాడారు. సిరిసిల్ల నియోజకవర్గంలో కేకే మహేందర్ రెడ్డి గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ ఇచ్చిన పార్టీగా కాంగ్రెస్‌ను ప్రజలు ఆదరించారని, అన్నింటి కంటే ముఖ్యమైన కుటుంబ పాలనకు ముగింపు పలుకుతున్నారన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు పదేళ్లుగా అధికార బీఆర్‌ఎస్‌పై పోరాటం చేశారన్నారు. ప్రజావ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ఖండిస్తూ ఉద్యమాలు చేశామన్నారు. అవినీతి నియంత పాలనకు వ్యతిరేకంగా, కాంగ్రెస్ విజయానికి ఓట్లు వేసిన వారందరికి ధన్యవాదాలు తెలిపారు. ప్రజలకు అనుక్షణం అండగా ఉంటూ వారి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు గౌస్ కాంగ్రెస్, ముస్తాబాద్ పట్టణాధ్యక్షుడు గజ్జెల రాజు, ఎంపీటీసీ శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

దివ్యాంగుల దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

కోనరావుపేట: డిసెంబర్ 3 అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని విజయవంతం చేయాలని మండల వికలాంగుల సంఘం ప్రధానకార్యదర్శి ఎల్లె రవీందర్‌రెడ్డి కోరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డిసెంబర్ 3న నిర్వహించే వికలాంగుల దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో, కనగర్తి గ్రామంలో ర్యాలీ నిర్వహించడం జరుగుతుందన్నారు. అన్ని గ్రామాల ప్రజలు, దివ్యాంగులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. ఆయన వెంట పల్లం లింగయ్య, సిర్ర నర్సయ్య, మాందాల సుధాకర్, బుర్ర భూమయ్య, కర్నాల భూమయ్య తదితరులు ఉన్నారు.

ఓటర్లకు ధన్యవాదాలు

తంగళ్లపల్లి: ఇల్లంతకుంట మండలవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కవ్వంపల్లి సత్యనారయణ గెలుపు కొరకు కష్టపడి పనిచేసిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు శుక్రవారం ఎంపీపీ వూట్కూరి వెంకటరమణరెడ్డి ఒక ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి మద్దతిచ్చి ఓట్లు వేసిన ఓటర్లకు కృతజ్ఞతలు తెలియజేశారు.

నారు మళ్లకు సిద్ధం

- రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలి
- అధికారుల సూచనలు తీసుకోవాలి

వేములవాడఅర్బన్: యాసంగి వరి పంట నారు మళ్లకు రైతులు సిద్ధం అవుతున్నారు. వరి నారును ఇప్పుడు త్వరగా పోసుకుంటే వరి పంటలకు నీరు పుష్కలంగా ఉంటుందని, వరి నారు ఆలస్యంగా పోస్తే అప్పటికి వరి పొట్ట దశలో ఎండలు విపరీతంగా ఉండి నీరు అందక ఎండుతుందని, చాలీచాలని నీటితో తాలు అధికంగా వస్తుందని ముందు జాగ్రత్త ఇప్పటి నుంచి వరినారు పోస్తున్నారు. యాసంగిలో వేములవాడ మండలంలో 4,800 ఎకరాలు, వేములవాడ రూరల్ మండలంలో 10,200 ఎకరాలు వరినాట్లు వేయనున్నట్లు వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు.


వేములవాడలో రెండు రోజుల క్రితం పోసిన నారుమడి

నారు మడిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- ➡ నారు పోసే వారం రోజుల ముందుగానే నారు మడికి నీరు వేసి దుక్కి దున్ని సిద్ధంగా ఉంచుకోవాలి.
- ➡ నారు చలికి ఎదగక ఎర్రబడి కొన్నిసార్లు చనిపోతుంది. దానికి రసాయనిక ఎరువులు (నత్రజని, పొటాస్)తో పాటు రెండు క్వింటాళ్ల మాగిన ఎరువు గొర్రెలు, కోళ్ల ఎరువులను దుక్కిలో కలిపి దున్నాలి.
- ➡ ఇప్పటి నుంచి డిసెంబర్ 20 వరకు వరి నారు పోసేందుకు అనుకులంగా ఉంటుంది.
- ➡ వరినారు పోసిన వారం రోజులు ఉదయం నీటిని పెట్టి వదిలేసి ఆరబెట్టాలి.
- ➡ చలి తీవ్రత ఎక్కువగా ఉండటంతో నారుమడి చుట్టూ కట్టెలు నాటి పలుచని పాలిథిన్ షీట్ లేదా మందు బస్తాలతో తయారు చేసిన పరదాను సాయంత్రం వేళల్లో కప్పి మరునాడు ఉదయం తీసివేయాలి.
- ➡ దీంతో రాత్రివేళల్లో మంచు, నారుపై పడకుండా రక్షణగా ఉంటుంది.
- ➡ నారు ఆరోగ్యంగా పెరిగేందుకు ఒక కిలో యూరియాతో పాటు 2 గ్రాముల కార్బండాజిమ్, మాంకోజెబ్ మిశ్రమ మందును వేసుకోవాలి.
- ➡ 10 రోజుల తర్వాత నారుమడిలో నీరు నిండుగా ఉంచి తెల్లవారుజామున ఆ నీటిని తీసివేసి, మళ్లీ కొత్త నీరు పెట్టాలి.
- ➡ నారు పోసిన 25 నుంచి 30 రోజుల్లో నాటు వేసుకోవాలి.

వరి నారును జాగ్రత్తగా కాపాడుకోవాలి



నారుమళ్లు వేసేటప్పుడు ఎంత జాగ్రత్త తీసుకుంటే అంత మంచిగా నారు ఎదుగుతుంది. చలికాలం కావడంతో నారు మడికి మంచుపడకుండా చుట్టూ కట్టెలు వేసి రాత్రివేళ మందు బస్తాల పరద కప్పాలి. మొదటగా నారు పోసినప్పుడు వారం రోజులు ఉదయం నీరు పెట్టి రెండు గంటల తర్వాత ఆరబెట్టాలి. జాగ్రత్తలు పాటిస్తేనే నారు ఎదుగుదలను బట్టి నాటుకు అనుకూలంగా ఉంటుంది. నీటి యాజమాన్య పద్ధతి పాటించాలి.

– సాయి కిరణ్, ఏవో, వేములవాడ

రక్షణ చర్యలేవి?


కూలిన వరదకాలువ బ్రిడ్జి సేఫ్టీ సైడ్ వాల్

బోయినపల్లి: మండల కేంద్రం నుంచి కొదురుపాక వెళ్లే డబుల్ రోడ్డులో దేశాయిపల్లి వద్ద వరదకాలువ బ్రిడ్జిపై ఒకవైపు సేఫ్టీ సైడ్ వాల్‌ను ఏడాది క్రితం గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో కొంతమేర కూలిపోయింది. దీంతో వరదకాలువ బ్రిడ్జిపై ప్రయాణం ప్రమాదంగా మారింది. ఏడాదికాలంగా మరమ్మతు చేయడం లేదని గ్రామస్తులు తెలిపారు. సేఫ్టీ సైడ్ వాల్ మధ్యలో గ్యాపు ఏర్పడడంతో రాత్రివేళ వాహనాలు అదుపు తప్పితే వరద కాలువలో పడే అవకాశం ఉంది. కొద్దినెలల క్రితం కూలిన ప్రదేశంలో ఇరిగేషన్ అధికారులు నీలగిరి కర్రలు అడ్డుగా కట్టారు. ప్రస్తుతం ఆ కర్రలు పుచ్చిపట్టి ఊడిపోతున్నాయి. ఇరిగేషన్ అధికారులు స్పందించి శాశ్వత మరమ్మతు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని సింగారం శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను ఓ ప్రైవేటు వాహనంలో సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు. వివరాలు ఇలా ఉన్నాయి. ముస్తాబాద్ మండలం గోపాలరావుపల్లెకు చెందిన వినయ్, నవీన్ బైక్‌పై ఎల్లారెడ్డిపేటకు శుక్రవారం సాయంత్రం వెళ్లి తిరిగి వస్తుండగా కోతి ఎదురుగా రావడంతో బైక్ అదుపుతప్పింది. ఈ ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. రోడ్డు వెంట వెళ్తున్న వారు గమనించి క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు.

అన్నదానం

వేములవాడ: మై వేములవాడ ట్రస్టు ఆధ్వర్యంలో శుక్రవారం అన్నదానం చేశారు. లక్ష్మీ గణపతి కాంప్లెక్స్, రాజన్న ఆలయం, భీమేశ్వర ఆలయం ప్రాంతంలో ఉన్న పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ట్రస్టీ సభ్యులు నాగుల చంద్రశేఖర్, ప్రతాప నటరాజు, చల్లా సత్తయ్య, వేణు, ఆంజనేయులుగౌడ్, ప్రసాద్ పాల్గొన్నారు.

రాజన్న కోడెలకు పశుగ్రాసం



రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామానికి చెందిన రైతు ఎడవెల్లి వెంకటరమణారెడ్డి వరిగడ్డిని కట్టలు కట్టించి వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి దేవాలయం కోడెలకు సొంత ట్రాక్టర్‌లో తీసుకెళ్లి శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో నిత్య జనగణమన కమిటీ అధ్యక్షుడు ఎడవెల్లి మహిపాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.